# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-04-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. దేశంలో ప్రతి ఇంటికీ తాగు నీరు ... రైతుకు సాగు నీరు అందించడమే బి.జె.పి. లక్ష్యమని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఉద్ఘాటించారు.**

**2. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌కు ఉజ్వల భవిష్యత్ కల్పిస్తుందని కూటమి నేతలు ఎన్. చంద్రబాబు నాయుడు ..., కె. పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు.**

**3. కడప జిల్లా ఒంటిమిట్టలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం ఈ రోజు సాయంకాలం జరగనున్నది.**

**4. తెలంగాణాలో రైతు రుణ మాఫీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేస్తుందని ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.**

**5. ఆంధ్రప్రదేశ్‌లో పదవ తరగతి పరీక్షా ఫలితాలు ఈ రోజు విడుదలవుతాయి.**

**6. భూమి పరిరక్షణ పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ రోజు ధరిత్రీ దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

==========================

దేశంలో ప్రతి ఇంటికీ తాగు నీరు ...., రైతుకు సాగు నీరు అందించడమే భారతీయ జనతా పార్టీ ప్రథమ లక్ష్యమని ఆ పార్టీ సీనియర్ నాయకులు ...., ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఉద్ఘాటించారు. రాజస్థాన్ రాష్ట్రంలోని జలోర్ జిల్లాలో నిన్న జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ ..... హర్ ఘర్ జల్ పథకం కింద నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించామని తెలిపారు. జల్ జీవన్ మిషన్ కింద దేశ వ్యాప్తంగా గత పదేళ్లలో కోట్లాది మంది ప్రజలు లబ్ది పొందారని నరేంద్ర మోడీ పేర్కొన్నారు.

--------------------------

దేశంలో ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలలో ఓటు హక్కు వున్న ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ విజ్ఞప్తి చేశారు. ఓటు హక్కు వినియోగం పట్ల అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో కేంద్ర ఎన్నికల సంఘం “”” మై ఓట్ ... మై వాయస్””” పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమం సందర్భంగా ఆయన ఒక వీడియో సందేశం ఇస్తూ .... ఓటు హక్కును ఎవరూ వదులు కోవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ గర్వంగా ఓటు వేయాలని కోరారు. పోలింగ్ కేంద్రంలో వేలిపై వేసే సిరా గుర్తు ....దేశం పట్ల మనకు వున్న బాధ్యతను గుర్తు చేస్తుందని అన్నారు. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశ

రాజ్యాంగం మనకు అనేక హక్కులు కల్పించిందని .... ఓటు వేయడం పౌరులుగా మన ప్రధాన బాధ్యత అని డి.వై. చంద్ర చూడ్ పేర్కొన్నారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్ర ప్రదేశ్ లో తెలుగు దేశం పార్టీ శ్రేణులు విజయ సంకల్పంతో ముందుకు వెళ్లాలని ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు కోరారు. పార్లమెంటు ....., శాసన సభలకు తెలుగు దేశం పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు గుంటూరు జిల్లా ఉండవల్లిలో నిన్న ఆయన బి ఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ....ఎన్నికలు సమీపిస్తున్న ఈ సమయం ఎంతో కీలక మైనదని ...., రాష్ట్రంలో ప్రత్యేక పరిస్థితులలో ఎన్నికలు జరుగుతున్నాయని ..., “”” ప్రజలు గెలవాలి ...., రాష్ట్రం నిలవాలన్నదే తమ నినాదమని స్పష్టం చేశారు. రాష్ట్రాభివృద్ధిని ప్రస్తుత వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని .... , అమరావతి రాజధాని ...., పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలను విస్మరించిందని ఆయన విమర్శించారు. ఇలాఉండగా .... శాసన సభ అభ్యర్థుల జాబితాలో తెలుగు దేశం పార్టీ అయిదు చోట్ల మార్పులు చేసింది. ఉండి అభ్యర్థిగా రఘురామకృష్ణంరాజు ...., పాడేరుకు గిడ్డి ఈశ్వరి ..., మాడుగులకు బండారు సత్యనారాయణ మూర్తి ...., మడకశిరకు ఎం.ఎస్.రాజు .., వెంకటగిరికి కురుగొండ రామకృష్ణలకు స్థానం కల్పించింది.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ కు ఉజ్వల భవిష్యత్ కల్పించడం కోసం తెలుగు దేశం ..., జన సేన ..., భారతీయ జనతా పార్టీల కూటమి కృషి చేస్తుందని జన సేన పార్టీ అధ్యక్షుడు కె. పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం, భీమవరం పట్టణాల్లో నిన్న ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ .... రాష్ట్ర పునర్నిర్మాణమే ఎన్. డి. ఎ. కూటమి లక్ష్యమని స్పష్టం చేశారు. కూటమి అధికారంలోకి వస్తే అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తామని ..., చేతి వృత్తులు ...., కుల వృత్తులను పరిరక్షిస్తామని ...., అన్నా క్యాంటీన్లతో పాటు డొక్కా సీతమ్మ క్యాంటీన్లు కూడా నడుపుతామని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ లో వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను రెండు రోజులలో విడుదల చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి తెలిపారు. కృష్ణా జిల్లా పెనమలూరులో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ....వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ...., ముఖ్య మంత్రి వై ఎస్ జగన్ మోహన రెడ్డి ఈ నెల 25 వ తేదీన నామినేషన్ దాఖలు చేస్తారని చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికల అంశంపై నియోజకవర్గాల వారీగా సమీక్ష నిర్వహిస్తున్నామని ...., సంక్షేమం ...., అభివృద్ధి కార్యక్రమాలు 80 శాతం మంది ప్రజలకు చేరాయని సజ్జల రామకృష్ణా రెడ్డి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగ నోటిఫికేషన్లు లేకపోవడంతో యువత నిరుద్యోగులయ్యారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వై. ఎస్ షర్మిల పేర్కొన్నారు. కర్నూలులో నిన్న నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడుతూ వై. ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కర్నూలును స్మార్ట్ సిటీ చేస్తామని హామీ ఇచ్చిందనీ.. కనీసం మంచినీళ్లు లేని పరిస్థితి నెలకొందనీ విమర్శించారు. ఐదేళ్లలో రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదనీ, గుండ్రేవుల ప్రాజెక్టు పూర్తయి ఉంటే కర్నూలు నగర వాసులకు నీటి సమస్య తీరేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇలా ఉండగా ఆంధ్రప్రదేశ్ నుంచి 9 లోక్‌సభ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ నిన్న ఖరారు చేసింది.

---------------------------

శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలల్లో భాగంగా కడప జిల్లాలోని చారిత్రాత్మక ఒంటిమిట్ట శ్రీకోదండరామాలయంలో ఈ సాయంకాలం 6 గంటల 30 నిమిషాల నుంచి రాత్రి 8గంటల వరకు శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు.కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించడానికి చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. లక్షలాది మంది భక్తులు హాజరయ్యే ఈ ఉత్సవాల సందర్భంగా ఏ ఒక్కరికీ అసౌకర్యం కలగకుండా తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. శాశ్వత కళ్యాణ మండపంలో లక్ష మంది భక్తులు వీక్షించే విధంగా సౌకర్యాలు కల్పించారు. వేద పండితుల సమక్షంలో సీతారాముల కల్యాణం జరగనుంది. వేదిక ప్రాంగణంలో భారీ ఎల్?ఈడీ తెరలను అధికారులు ఏర్పాటు చేశారు. కల్యాణ మహోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

---------------------------

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు వచ్చే ఆగష్టు 15వ తేదీ లోగా రెండు లక్షల రూపాయల రుణ మాఫీ హామీని తప్పనిసరిగా అమలు చేస్తుందని ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాదు సమీపంలోని భువనగిరి పట్టణంలో నిన్న జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అయిదు హామీలను ఇప్పటికే అమలు చేసిందని ...., వచ్చే పంటలో వడ్ల కోసం ప్రత్యేక బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తామని తెలిపారు. భారత రాష్ట్ర సమితి పదేళ్ల పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని ...., యువతను ...., నిరుద్యోగులను విస్మరించిందని రేవంత్ రెడ్డి విమర్శించారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్‌లో పదవ తరగతి పరీక్షా ఫలితాలు ఈ రోజు విడుదలవుతాయి. పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సురేష్ కుమార్ విజయవాడలో ఈ రోజు ఉదయం 11 గంటలకు ఈ ఫలితాలను విడుదల చేస్తారని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు డి. దేవానంద రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో పదవ తరగతి పరీక్షలకు ఈ ఏడాది మొత్తం 7 లక్షల 24 వేల మంది విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోగా ....., 96 శాతం మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరిలో 6 లక్షల 23 వేల మంది రెగ్యులర్ విద్యార్థులు వున్నారు.

---------------------------

వచ్చే ఐదేళ్లలో దేశంలోని పేద, మధ్య తరగతి వర్గాల వారి సొంతింటి కలను సాకారం చేసే దిశగా మరో 3 కోట్ల ఇళ్లను భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం నిర్మించి ఇస్తుందని ఆ పార్టీ తెలంగాణా అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ లో నిన్న ఆయన సంకల్ప పత్రాన్ని విడుదల చేసిన సందర్భంగా మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి వస్తే రాబోయే ఐదేళ్లలో దేశాన్ని మూడవ ఆర్థిక వ్యవస్థగా మారుస్తామని అన్నారు. గత తొమ్మిదేళ్ల లో దేశ వాసులకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం, పేదలకు పక్కా ఇళ్లు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. పోస్టాఫీసులను మినీ బ్యాంకులుగా మార్చేస్తున్నామనీ, దేశాన్ని చిరుధాన్యాల కేంద్రంగా మారుస్తామనీ కిషన్ రెడ్డి భరోసా ఇచ్చారు.

---------------------------

ప్రపంచ వ్యాప్తంగా రోజు రోజుకీ తీవ్రమవుతున్న వాతావరణ సమస్యలపై దృష్టి సారించే ఉద్దేశ్యంతో ఈ రోజు ధరిత్రీ దినోత్సవం నిర్వహిస్తున్నారు. సమస్త జీవ కోటి భారాన్ని మోస్తున్న భూమి పరిరక్షణ కోసం తీసుకోవలసిన చర్యల పట్ల అవగాహనా కల్పించడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. నానాటికీ పెరుగుతున్న భూతాపం ...., వాతావరణ కాలుష్యం ...., విచక్షణా రహితంగా అడవుల నరికివేత ...., ఇబ్బడిముబ్బడిగా వాహనాల వినియోగం వంటి అంశాల కారణంగా పర్యావరణ సమతుల్యం దెబ్బతింటోంది. వీటి ప్రభావం భూమిపై పడి మానవ కోటి మనుగడకు ముప్పు ఏర్పడుతోంది. అందువల్లనే భూమి పరిరక్షణ కోసం తీసుకోవలసిన చర్యల

పట్ల అవగాహనా కల్పిస్తూ ధరిత్రీ దినోత్సవం నిర్వహిస్తున్నారు. 1968 జనవరి 28 వ తేదీన శాంటా బార్బరా సముద్ర తీరం చమురు తేట్టుతో నిడిపోవడంతో వేలాదిగా జీవ జాతులు మృత్యువాత పడ్డాయి. ప్రపంచ ధరిత్రి దినోత్సవం నిర్వహించడానికి ఈ సంఘటన పునాదిగా మారింది. 1970 నుండి ప్రతి ఏటా ధరిత్రీ దినోత్సవం నిర్వహిస్తున్నారు. దీనిని అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే అని కూడా పిలుస్తారు.

-------------------------

హనుమాన్ జయంతి సందర్భంగా రేపు హైదరాబాద్ లో మద్యం దుకాణాలు మూసివేయాలని పేర్కొంటూ నగర పోలీస్ కమిషనర్ పీ శ్రీనివాస్ రెడ్డి ప్రకటన విడుదల చేశారు. రేపు ఉదయం 6 గంటల నుంచి 24వ తేదీ ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. నిబంధనలు పాటించని దుకాణాలపై చర్యలు తీసుకుంటామని శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు.

-------------------------

తెలంగాణా రాష్ట్రంలో రాగల నాలుగు రోజుల పాటు తేలికపాటు నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో నిన్న వడగళ్ల వాన కురిసింది. వర్షాలు కురిసిన ప్రాంతాలలో ప్రజలు ఎండ వేడిమి నుండి ఉపశమనం పొందారు.

======================